
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



ఎన్నికలు వచ్చే.. ఉపాధి తెచ్చే

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ప్రచారాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు వివిధ రంగాల్లోని వారికి ఉపాధి కల్పిస్తున్నాయి.

- 8లో ▸



డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.0	25.0
కాకినాడ	39.0	28.0
అమలాపురం	41.0	27.0

న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళి పాటించాలి



కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళి, తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఉండవలసిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసిందన్నారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నామినేషన్లు సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో ఆర్వో ఛాంబర్ లోనికి అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు తమ బీఫారం ఎ-ఫారం ఒరిజినల్ అందించాలన్నారు. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చునన్నారు. అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రసీదుతో పాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్ణీత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలన్నారు. అభ్యర్థులపై క్రిమినల్ కేసులుంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలన్నారు..అందుకు అయ్యే ఖర్చును లెక్క చూపాలన్నారు. ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారన్నారు. అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్ అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారన్నారు. నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నోటీసు బోర్డులోనూ పరిశీలనకు ఉంచుతారన్నారు. నామినేషన్ల దాఖలు పారదర్శకంగా ఉండేందుకు ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారన్నారు..

షిర్డీ సాయికి స్వర్ణ కిరీటం సమర్పణ



సాయినాథునికి స్వర్ణకిరీటం అలంకరించిన భక్తులు

యానాం: స్థానిక శివాలయం ఆవరణలో కొలువైన శ్రీషిర్డీ సాయినాథుడికి ఆదివారం యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వర్ణకిరీటాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రూ.25 లక్షలు విలువచేసే 320 గ్రాముల స్వర్ణకిరీటాన్ని సాయినాథునికి అలంకరించారు. అనంతరం ఆలయంలో షిర్డీ సాయినాథుని సన్నిధిలో విశేషపూజలు నిర్వహించారు. సాయినాథుని 189వ జన్మదినం శ్రీరామనవమి రోజున జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక వర్తకులు, రైస్ మిల్లర్స్, భక్తుల సహకారంతో సుమారు 3వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీషిర్డీ సాయి ధార్మిక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అట్టడుగుకు అభివృద్ధి ఫలాలు

- కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత మౌలిక నదుపాయాలకు పెద్ద పీట
- లంక గ్రామాలకు వారధులు
- మెరుగుపడ్డ ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు
- గోదావరి లంక, మత్స్యకార గ్రామాలకు తీరిన దాహార్తి
- రూ.1,650 కోట్లతో మెగా వాటర్ గ్రిడ్
- రూ.450 కోట్లతో జల్‌జీవన్ మిషన్
- వేగంగా సాగుతున్న సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలు



ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండి వద్ద వృద్ధగౌతమీ పాయపై నిర్మించిన వంతెన



అమలాపురం మండలం పేరూరు ఎత్తు రోడ్డు వద్ద నుంచి అల్లవరం మండలం ఓడలరేవు వరకు విస్తరించి.. ఆధునీకరించిన రహదారి



పి.గన్నవరం మండలం గంటిపెద పూడి వద్ద సాగుతున్న వంతెన పియర్ల నిర్మాణ పనులు

సాక్షి, అమలాపురం: దశాబ్దాల కాలం నాటి ప్రత్యేక జిల్లా కోరిక తీరింది. జిల్లా యంత్రాంగం కొలువుదీరింది. అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం వేగంగా పరుగులు తీస్తున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో కోనసీమ వాసుల దశాబ్దాల నాటి కలను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. పాత కోనసీమ (అమలాపురం డివిజన్)తోపాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలతో ఏప్రిల్ 2, 2022న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడింది. ఏడు నియోజకవర్గాలలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీలతోపాటు 22 మండలాలు 315 పంచాయతీలు 515 సచివాలయాలతో ఏర్పడిన ఈ జిల్లాలో గోదావరి సప్త నదీపాయలు ప్రవహిస్తుండడం విశేషం.

కొత్త జిల్లాలో పరిపాలనా పరమైన పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చేపట్టింది. కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేయడం, వాటికి అధికారులను నియమించడం చకచకా సాగిపోయింది. కొత్తగా ఏర్పడినా.. అధికారులు కొత్తవారే అయినా పరిపాలనా పరంగా ఎటువంటి ఇబ్బందీ రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ప్రగతి పరుగులు

- గ్రామ సచివాలయాలు 198, రైతు భరోసా కేంద్రాలు 68, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు 35 భవనాలను నిర్మించారు.13 మండలాలలో 979.734 ఎకరాల లంక భూములను 2,991 మంది లబ్ధిదారులకు ఈ-పట్టాలు, లీజు పట్టాలుగా పంపిణీ చేశారు.
- జిల్లాలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నాడు-నేడులో రూ.9.21 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో నాలుగు పీహెచ్‌సీల పనులు పూర్తి కాగా, ఒకటి నిర్మాణ దశలోను, మరొకటి టెండర్ల దశలో ఉన్నాయి.
- గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 515 సచివాలయాలలో ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. స్థానిక ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గుర్తించిన ముఖ్యమైన పనులు చేపట్టారు. ఇందుకుగాను 1,102 పనులకు రూ.72.88 కోట్లు ఖర్చు చేశారు.

విద్యా సుగంధాలు

మనబడి నాడు-నేడు పథకం ఫేజ్-1లో 436 పాఠశాలలకు రూ.104.96 కోట్లు, ఫేజ్-2లో 761 పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.257 కోట్లు మంజూరయ్యాయి.

పేదలకు రికార్డు స్థాయిలో ఇళ్లు

- 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' లో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 24,644 గృహాలను 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - వైఎస్సార్ పట్టణ పథకం' ద్వారా రూ.443.59 కోట్లతో చేపట్టారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన- వైఎస్సార్ గ్రామీణ' పథకం ద్వారా 9,810 గృహాల నిర్మాణాలు రూ.176.58 కోట్లతో చేపట్టారు.
- 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ -వైఎస్సార్ జగనన్న నగర్ ఇళ్లు ' పథకంలో భాగంగా 4,794 లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేశారు. మరో 5,024 ప్లాట్‌లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధం చేశారు.

ప్రతి ఇంటికీ కుళాయి

- జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికీ కుళాయి కల్పించాలనే ఉద్దేశంతో 'జల జీవన్ మిషన్' ద్వారా జిల్లాలోని ఒక వెయ్యి 834 ఆవాస ప్రాంతాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి రూ.515.93 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణం చేపట్టారు. జగనన్న కాలనీల్లో 209 లేఅవుట్లలో నిర్మించిన కుళాయిల ఏర్పాటుకు రూ.45.75 కోట్లు కేటాయించారు. గోదావరి నుంచి నేరుగా నీటిని అందించేందుకు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ఇందుకు రూ.1,650 కోట్లు కేటాయించారు.

విద్యుత్ వెలుగులు

అయినవిల్లి మండలంలో రూ.300 కోట్లతో 440/132 కేవీ మెగా విద్యుత్ స్టేషన్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇది పూర్తయితే కోనసీమ జిల్లాకు సాంకేతిక అవరోధాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగనుంది. జిల్లాలో 15 కొత్త 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలకు ప్రతిపాదించారు.

మెరుగుపడిన రహదారులు

- జిల్లాలో గడిచిన ఐదేళ్లలో రహదారులు, భవనాల నిర్మాణాలకు రూ.299.40 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో రూ.229.40 విలువైన పనులు మొదలు కాగా, రూ.166.4 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఇవి కాకుండా రూ.70 కోట్ల నిధులు తాజాగా మంజూరయ్యాయి.
- జిల్లాలో 33 రోడ్లకు రూ.42.87 కోట్లతో మరమ్మతులు చేశారు. రెండవ దశలో రోడ్ల రిపేర్లకు సంబంధించి రూ.26.37 కోట్లు ఖర్చు చేశారు. తాజాగా రూ.28.81 కోట్లతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి.
- జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) కత్తిపూడి-ఒంగోలు మధ్య ఉన్న జాతీయ రహదారి 216 విస్తరణ పనులు వేగంగా సాగడానికి కారణం జిల్లాలో భూసేకరణ ప్రక్రియ పూర్తి కావడమే. సుమారు 374 కిమీలు నిడివిడి ఉన్న ఈ రహదారిని ఎన్‌హెచ్ రూ.నాలుగు వేల కోట్లతో విస్తరించింది. దశాబ్దాల కాలంగా రాజోలు దీవి వాసులు ఎదురుచూస్తున్న వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి ఎన్‌హెచ్ రూ.580.42 కోట్ల నిధులు మంజూరు చేసింది. రామరాజులంక వద్ద వశిష్ఠపై 380 మీటర్ల మేర వంతెన నిర్మాణం చేయనున్నారు.

రైల్వేకు వేగంగా భూసేకరణ

- కోనసీమ రైల్వేలైన్ నిర్మాణ పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే వేగంగా సాగుతున్నాయి. ఏడాదికి సగటున రూ.300 కోట్ల చొప్పున నిధులు వచ్చాయి. రైల్వే నిర్మాణ పనులకు భూసేకరణ దాదాపు పూర్తి కావస్తోంది.



నాడు- నేడులో ఆధునీకరించిన రాయవరం ఎంపీపీ పాఠశాల

లంక గ్రామాలకు తప్పుతున్న పాట్లు

- పి.గన్నవరం మండలం ఉడిమూడిలంక, గంటిపెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసులు వేసవిలో మినహా మిగిలిన సమయంలో బాహ్య ప్రపంచానికి రావాలంటే గోదావరి పాయ దాటాల్సిందే. దశాబ్దాలుగా ఈ ప్రాంత వాసులు వంతెన నిర్మించాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. సీఎం జగన్ హామీ మేరకు రూ.49.50 కోట్లతో వంతెన పనులు మొదలయ్యాయి.
- ముమ్మిడివరం- ఐ.పోలవరం సరిహద్దులను అనుకుని వృద్ధగౌతమీ, గౌతమీ నదీపాయల మధ్య ఉన్న పశువులలంక మొండి వద్ద రూ.49 కోట్లతో వంతెనకు దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేయగా సీఎం జగన్ ప్రారంభించారు. మూడు మండలాలో ఉన్న 8 వేల మందికి రహదారి సౌకర్యం ఏర్పడింది.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో ముగ్గురికి చోటు

అమలాపురం టౌన్: వైఎస్సార్ పీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం జిల్లాకు చెందిన ముగ్గురు నేతలను రాష్ట్ర కమిటీల్లోని వివిధ హోదాలతో పలు పదవుల్లో నియమించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కమిటీ ప్రధాన కార్యదర్శిగా ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన పితాని బాలకృష్ణను నియమించింది. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా కుసుమే ప్రవీణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కమిటీ కార్యదర్శిగా చీకట్ల బాల సుబ్రహ్మణ్యాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

370 ఫిర్యాదుల పరిష్కారం

అమలాపురం రూరల్: వచ్చే నెల 13వ తేదీన పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా 370 ఫిర్యాదులు పరిష్కరించినట్లు సీపీఓ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. గత నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 462 ఫిర్యాదులు రాగా వాటిలో 92 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించామన్నారు. మిగిలిన 370 ఫిర్యాదులలో 100 నిమిషాలలోపు 335 పరిష్కరించామని తెలిపారు.

ఉత్తుత్తి చేరికలు... గమ్మత్తు ప్రచారాలు

- టీడీపీలో విచిత్ర పరిస్థితి
- ఆ పార్టీ వారికే కండువాలు వేసి కొత్తగా చేరుతున్నట్టు హంగామా



నామవానిపాలెం గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకటసూర్యనారాయణరాజు పార్టీలో చేర్చుకుంటున్నట్టు హంగామా చేస్తున్న టీడీపీ నాయకులు

కాజులూరు: నియోజకవర్గ టీడీపీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో టీడీపీలోనే ఉన్నవారికి కొత్తగా కండువాలు వేస్తూ పార్టీలో చేరినట్టు ప్రచారం చేయడంతో నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు. అమలాపురానికి చెందిన స్థానికేతరుడు వాసంశెట్టి సుభాష్‌కు టీడీపీ టిక్కెట్ కేటాయించటంతో ఇక్కడ ఉన్న కేడర్ కినుక వహించి ప్రచారానికి దూరంగా ఉంటోంది. గతం నుంచి దూరంగా ఉంటున్న అదే పార్టీకి చెందిన వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న వైనం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిల్లి సూర్యప్రకాశ్ స్థానికుడు కావటం, నియోజకవర్గంలో 25 ఏళ్లుగా అందరికీ పరిచయాలు ఉండటంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పూర్తిగా నియోజకవర్గానికి కొత్త కావటంతో పాటుగా పార్టీలో చేరిన నెలరోజులకే టిక్కెట్‌ను ఆ పార్టీ నేత చంద్రబాబునాయుడు కేటాయించటంతో సొంత పార్టీ నుంచి, మిత్రపక్షం జనసేన నుంచి సహాయ నిరాకరణ కొనసాగుతోంది. దీంతో ప్రచారం చప్పగా సాగుతోంది. టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం వర్గాన్ని పక్కన పెట్టారనే ఆవేదనతో సీనియర్ కేడరంతా పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతుండగా మిత్ర పక్ష నాయకులు సైతం ఓటమి భయంతో అభ్యర్థికి దూరంగా ఉంటూ పార్టీ మారుతున్నారు. క్రమేపీ కేడర్ బలహీనం కావటంతో పాత వారినే కొత్తగా పార్టీలో చేర్చుకుంటూ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నట్టు ఆ పార్టీలో కొందరు నాయకులు హంగామా చేస్తున్నారు. ఆ పార్టీ నాయకులకే కొత్తగా కండువాలు కప్పి భారీగా చేరికలంటూ ఎల్లో మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాజులూరు మండలం నామవానిపాలెం గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకటసూర్యనారాయణరాజు రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారుతున్నట్టు కలరింగ్ ఇచ్చి టీడీపీ కండువా కప్పించారు. సూర్యనారాయణరాజు ఎంపీ అభ్యర్థి హరీష్ మాధుర్ తండ్రి దివంగత మాజీ లోక్‌సభ స్పీకర్, బాలయోగికి అత్యంత సన్నిహితుడు. సుదీర్ఘ కాలం పాటు మంత్రి చిక్కాలకు అనుచరుడిగానూ ఐదేళ్ల క్రితం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇక్కడ ఎమ్మెల్యే ఉన్న సమయంలో టీడీపీ క్రియాశీల నాయకుడిగానూ వ్యవహరించారు. సర్పంచ్‌గా ఉన్న కారణంగా మూడేళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాలలో అడపా, దడపా పాల్గొన్న భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరారన్న ప్రచారం మండల గ్రామాల ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. టీడీపీ అభ్యర్థి సుభాష్ నియోజకవర్గానికి వచ్చిన కొత్తలో అంటే సుమారు 20 రోజుల క్రితం గొల్లపాలెంలో స్థానికంగా ఓటు కూడా లేని నాయకుడొకరు వెయ్యిమంది కార్యకర్తలు, 20 మంది సర్పంచ్‌లు, 10 మంది ఎంపీటీసీ సభ్యులతో టీడీపీలో చేరారంటూ హంగామా చేశారు. అయితే పార్టీ మారేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో దుస్తులు పంపిణీ చేస్తున్నామంటూ కొందరిని పిలిపించి 38 మందికి బలవంతంగా పార్టీ కండువాలు వేసి మమ అనిపించారు. పూర్వం నుంచి ఆ పార్టీలోనే ఉంటున్న శలపాక గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజుకు, దుగ్గుదుర్రు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి భర్త జ్యోతికుమార్‌కు, జనసేన నాయకుడైన మంజేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గండి కిశోర్‌కు టీడీపీ కండువాలు వేసి నాయకులు జబ్బలు చరుచుకున్నారు. ప్రచారంలో స్పందన లేకపోయినా పార్టీలో చేర్పులు చూపిస్తూ హడావుడి చేద్దామన్నా పెద్దగా రక్తి కట్టకపోవటం పార్టీ నాయకులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఇంటింటికీ తాగునీటి కుళాయి

మంత్రి విశ్వరూప్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు

అమలాపురం టౌన్: ధవళేశ్వరం నుంచి గోదావరి జలాలను ఇన్‌టేక్ వెల్ నుంచి పైపు లైన్ల ద్వారా అమలాపురానికి తాగునీటి సరఫరా వ్యవస్థను తీసుకుని వచ్చి ఇంటింటికీ కుళాయి ఇవ్వాలన్న ప్రణాళిక అమలుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురంలోని యెండూరి కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విశ్వరూప్ మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేసి వారికి ఎక్కడా దాహార్తి అనే సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేసుకున్నానని విశ్వరూప్ చెప్పారు. అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పూర్తి స్థాయితో పరిష్కరించేందుకు ఈదరపల్లి, నల్లవంతెన, ఎర్ర వంతెనల వద్ద ప్రత్యామ్నాయంగా మూడు చోట్ల మూడు వంతెనలు నిర్మించేందుకు అసవరమైన మంజూరు ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. అమలాపురంలో ఇంటిగ్రేటెడ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకువస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇప్పటికే కీలకమైన రోడ్లను ఆధునీకరించి మౌలిక సదుపాయాల పరంగా ప్రాధాన్యం ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. అల్లవరం మండలంలో మరో కీలకమైన రెండు రోడ్ల నిర్మాణానికి త్వరలోనే ఏర్పాట్లు జరుగుతాయని చెప్పారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలనలో చేకూరుతున్న సంక్షేమ లబ్ధిని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పరిషత్ అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరరావు, జడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జీ, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వంటెద్దు వెంకన్నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సాకారమైన అభివృద్ధిని వివరించారు.

ఫలితం పదిలమేనా!

- నేడు ఉదయం 11 గంటలకు విడుదల కానున్న టెన్త్ ఫలితాలు
- గతేడాది ఉత్తీర్ణతా శాతం 73.48
- ఉత్కంఠలో విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు



పది పరీక్షలు రాసిన విద్యార్థులు

రాయవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సోమవారం ఉదయం విడుదల చేయనున్నారు. విద్యార్థి దశలో ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్షల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. విజయవాడలో ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానంద రెడ్డి ఉదయం 11 గంటలకు పదవ తరగతి ఫలితాలు విడుదల చేయనున్నారు. గత విద్యా సంవత్సరం మాదిరిగానే 2023-24 విద్యా సంవత్సరంలో కూడా నూతనంగా ఏర్పడిన జిల్లాల వారీగా పరీక్షలు నిర్వహించారు. గతేడాది విడుదలైన ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 73.48 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 13వ స్థానంలో నిలిచింది. జోన్-2 పరిధిలో 2వ స్థానంలో నిలిచింది. కాగా, ఈ ఏడాది పది ఫలితాల్లో కోనసీమ జిల్లా ఏ స్థానాన్ని నిలబెట్టుకుంటుందన్న విషయంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

21,113 మంది దరఖాస్తు

జిల్లాలో ఈ ఏడాది పది పరీక్షలు ఏప్రిల్ 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 21,113 మంది దరఖాస్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 112 పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 19,568 మందికి 19,121 మంది, హిందీ పరీక్షకు 19,141 మందికి 18,799 మంది, ఇంగ్లిషు పరీక్ష 19,346 మందికి 18,981 మంది, గణితం పరీక్షకు 19,991 మందికి 19,340 మంది, ఫిజికల్ సైన్స్ పరీక్షకు 20,520 మందికి 19,787 మంది, బయలాజికల్ సైన్స్ పరీక్షకు 20,523 మందికి 19,796 మంది, సోషల్ పరీక్ష 19,608 మందికి 19,072 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఓఎస్ఎస్‌సీ పరీక్షకు 2,109 మందికి, 2,096 మంది హాజరయ్యారు. జిల్లాలో పరీక్షలను జిల్లా యంత్రాంగం పటిష్టంగా అమలు చేసింది. ఈ ఏడాది తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ పరీక్షలను ఒక్కో పరీక్షను 100 మార్కుల వంతున ఐదు పేపర్లు, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లు ఒక్కో పేపరుకు 50 మార్కుల వంతున వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారు. అన్ని పరీక్షలకు బుక్‌లెట్ విధానాన్ని అమలు చేశారు.

రికార్డు స్థాయిలో సమయంలో..

ఈ ఏడాది రికార్డు స్థాయిలో పరీక్షా ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేస్తోంది, గత నెల 18 తేదీ నుంచి 30వ తేదీ వరకు పది పరీక్షలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఈ నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్దేశించిన సమయంలో పది జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించి, గడువులోపే మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,88,918 పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేశారు. మూల్యాంకనం పూర్తయిన కేవలం 13 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తుండడం గమనార్హం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అకడమిక్, పరీక్షల నిర్వహణలో ప్రతి దశలోను ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందనడానికి పది ఫలితాలే నిదర్శనంగా పలువురు పేర్కొంటున్నారు.

గతేడాది 73.48 శాతంతో..

గతేడాది పది పరీక్షల ఫలితాల్లో కోనసీమ జిల్లాలో 73.48 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 22 మండలాల పరిధిలో 18,936 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 13,915 మంది ఉత్తీర్ణత సాధించగా, మంది 5,021 మంది పరీక్ష తప్పారు. ఉత్తీర్ణులైన వారిలో బాలికలు 7,323 మంది, కాగా బాలురు 6,592 మంది ఉన్నారు. ఉత్తీర్ణులైన వారిలో ప్రథమ శ్రేణిలో 10,080, ద్వితీయ శ్రేణిలో 2,577, తృతీయ శ్రేణిలో 1,258 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఉన్నతాధికారుల నిర్దేశించిన సమయంలో..



ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో పది జవాబు పత్రాల మూల్యాంకనం నిర్దేశించిన సమయంలో పూర్తి చేశాం. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడంతోపాటు, మూల్యాంకన ప్రక్రియను కూడా చేపట్టాం.

– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

మెరుగైన ఫలితాలు వస్తాయన్న నమ్మకముంది



ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మెరుగైన ఫలితం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. ఎప్పటికప్పుడు వెనుకబడిన విద్యార్థుల ప్రగతిపై సమీక్ష చేపట్టాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారిణి, అమలాపురం

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న మైనర్ల అరెస్ట్

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న మైనర్ బాలురను అరెస్ట్ చేసినట్టు గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం, గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు గంజాయి తాగుడుకు బానిసలై తునిలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసిన కేజీ గంజాయిని స్కూటీ డిక్కీలో పెట్టుకుని విజయవాడ వైపు వెళుతున్నారు. మండలంలోని తాళ్లూరు శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వీరిద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కె.గంగవరం: మండల పరిధిలోని కుందూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల శ్రీనివాసరావు(27) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ముసునూరు మండలం ముసునూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ప్యాసింజర్ ఆటోపై పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆదివారం ఉదయం బయలుదేరాడు. అప్పనపల్లిలో స్వామివారి దర్శనం అనంతరం పంటుపై ముక్తేశ్వరం నుంచి కోటిపల్లి వచ్చి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరి వెళ్తుండగా కుందూరు వచ్చే సరికి తాడిగొయ్యి నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయే క్రమంలో ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న శ్రీనివాసరావు కిందపడడంతో తలపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కె.గంగవరం ఎస్సై జానీ బాషా సిబ్బందితో కుందూరు చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు: మోటార్ సైకిల్‌పై వెళుతూ డివైడర్‌ను ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చేబ్రోలు గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం కట్టమూరు చెందిన నాగిరెడ్డి వెంకన్నబాబు ఆదివారం కట్టమూరు నుంచి చేబ్రోలులో గల సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద బంధువుల ఫంక్షన్‌కు వెళుతుండగా మధ్యాహ్నం చేబ్రోలు హైవేపై కళ్లు తిరిగి మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయం అయింది. అటుగా వెళుతున్న సీఐ శ్రీనివాసరావు ఆగి వెంటనే 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు వచ్చే.. ఉపాధి తెచ్చే

- పూలు మొదలు వాహనాల వరకు గిరాకీ
- ఫొటో, వీడియోగ్రాఫర్లు బిజీ బిజీ
- హోటళ్లకు పెరిగిన తాకిడి
- కళాకారులకు, ప్రింటింగ్ ప్రెస్‌లకు డిమాండ్


సౌండ్ సిస్టమ్స్


కార్లు



ప్రింటింగ్ మిషన్

కాకినాడ సిటీ/రాయవరం: ఎన్నికలంటే ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రచారాలు, పరోక్షంగా వివిధ వృత్తిదారులకు ఉపాధిని కల్పిస్తున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక పూర్తవ్వడంతో ఎవరికి వారుగా విభిన్న రకాలుగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వీరి ప్రచారం మరికొందరికి ఉపాధి కల్పిస్తోంది. షెడ్యూల్ ఇచ్చినప్పటి నుంచి ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ప్రచారాలు ముమ్మరంగా ప్రారంభించడంతో పాటు ఈ నెల 18న నామినేషన్ దాఖలు మొదలు, విజయోత్సవ ర్యాలీల వరకు జన సమీకరణతో ముడిపడి ఉండటంతో ఆయా వర్గాలకు వేసవికాలంలో ఉపాధి లభిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవాలంటే బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా సందడి చేయాల్సిందే.

డప్పు కళాకారులకు ఆదరణ

ఎక్కడ ఏ ర్యాలీ, సభలు, సమావేశాలు, ఏదైనా కానీ వీరు ఉండాల్సిందే. అభ్యర్థులు గల్లీలో ప్రచారానికి వెళ్లినప్పుడు వీరి ముందు డప్పుచప్పుళ్ల బృందం వారు నృత్యాలు చేస్తూ ప్రచారానికి జోష్ తీసుకొస్తారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలోనూ వీరు భాగమయ్యారు. ఈ డప్పు కళాకారులకు బృందంలోని సభ్యుల సంఖ్యను బట్టి రోజుకు రూ. 3 వేల నుంచి రూ. 5 వేలు చెల్లిస్తున్నారు. ఎన్నికల సమయంలో చేతినిండా పని దొరుకుతోందని వీరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెంట్‌హౌస్, మైకులకు గిరాకీ

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరి పరిధి ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులందరూ మండల కేంద్రాల్లో చిన్నచిన్న సమావేశాలు ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నారు. ఇలా ఏర్పాటు చేసిన సభలకు టెంట్‌లు, కుర్చీలు సమకూర్చుతూ కొంతమంది ఆదాయం ఆర్జిస్తున్నారు. సమావేశంలో మాట్లాడటానికి మైకులు, లౌడ్‌స్పీకర్లు సమకూర్చుతూ మరికొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఏదైనా పెద్ద నాయకులు ర్యాలీ చేసిన సందర్భంలో డీజేలను తప్పక ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలా పలు రకాలుగా వీటికి ఎన్నికల సందడితో గిరాకీ పెరిగినట్లు వాటి నిర్వాహకులు చెబుతున్నారు.

పూలకు పెరిగిన డిమాండ్

అభ్యర్థులు, ప్రచారానికి వచ్చే నాయకులకు పూల దండలు వేయడానికి కార్యకర్తలు పోటీ పడుతుంటారు. ప్రచారంలో అభ్యర్థులపై పూల వర్షం కురిపిస్తున్నారు. పూల వ్యాపారానికి గిరాకీ పెరిగింది. బంతిపూలు, గులాబీ దండల ధర పెరిగిపోయింది. ఒక్కో దండ సుమారు రూ.300 పలుకుతుంది.

పుట్టుకొస్తున్న సోషల్ మీడియా టీములు

అభ్యర్థులు తాము పాల్గొన్న సమావేశాలు, ప్రచార ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయటానికి, అలాగే తమ పార్టీ గుర్తించి, మేనిఫెస్టోల గురించి సోషల్ మీడియాలో తెలపటానికి అభ్యర్థులు సోషల్ మీడియా టీములను ఏర్పాటు చేసుకున్నారు. దీనికోసం కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువకులను ఎంపిక చేసుకొని వారిని తమ మీడియా టీంగా ఎంపిక చేసుకుని నియమించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు నేతల వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేయడమే వీరి బాధ్యత. దీనికి గానూ వీరికి కొంత వేతనం చెల్లిస్తున్నారు. ఈ విధంగా ఎన్నికలు ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తూ ఆదాయ మార్గంగా మారాయి.

బంకుల్లో బారులు

ప్రచార సమయంలో కార్యకర్తలతో నేతలు బైక్ ర్యాలీలు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను సమీకరించి వాటిలో పెట్రోలు కొట్టిస్తున్నారు. అలాగే నేతల వెంట తిరిగే ముఖ్య నాయకులు, కార్యకర్తల వాహనాలలో బంకుల్లో పెట్రోలు కోసం బారులు కనబడతాయి.

బోనస్‌గా మద్యం

ఎన్నికలంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. చిన్నపాటి సమావేశం, ర్యాలీ తీయాలంటే భారీగా జనాన్ని సమీకరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో జన సమీకరణ చేసి, వారికి కార్యక్రమం పూర్తి కాగానే రూ.300 భత్యం ఇవ్వటంతో పాటు, అదనంగా బీరు, క్వార్టర్ మందు పంపిణీ చేస్తారు. దీంతో సమావేశం జరిగిన ప్రాంతంలో ఆ రోజు మద్యం అమ్మకాలు విపరీతంగా జరుగుతాయి. మద్యం షాపులు పక్కనే ఉన్న మిర్చిబండిల వారి అమ్మకాలు కూడా జోరుగా కొనసాగుతాయి.

ప్రింటింగ్ ప్రెస్ కళకళ

ఇప్పుడు ఎక్కడ ఏ చిన్న సమావేశం జరిగినా అక్కడ నాయకులు, అభ్యర్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సర్వసాధారణమై పోయింది. అభ్యర్థులు తమ పార్టీ గుర్తుతో ఫ్లెక్సీలను కూడళ్లలో ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. కరపత్రాలు ముద్రించి ఓటర్లకు పంచుతున్నారు. దీంతో ప్రింటింగ్ ప్రెస్‌లు ప్రచార సామగ్రి తయారులో బిజీబిజీగా ఉన్నాయి.

కళకళలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ఎన్నికల వేళ జిరాక్స్ సెంటర్లకు గిరాకీ ఏర్పడింది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఎత్తుగడలు వేస్తుంటారు. ఓటరు జాబితా సేకరించి తదనుగుణంగా ప్రణాళిక రచిస్తారు. అధికారుల నుంచి ఓటరు జాబితాను సేకరించి పదుల సంఖ్యలో జిరాక్స్ తీస్తుంటారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగింపుతో ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది.

హోటల్స్ ఫుల్

సభలకు, ప్రచారాలకు సమీకరించిన జనాలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందజేయడం తప్పనిసరి. దీంతో నాయకులు దగ్గరిలోని హోటళ్లకు వెళ్లి ఆర్డర్ ఇస్తున్నారు. టోకెన్లు తీసుకొని వచ్చి జనాలకు పంచుతున్నారు. దీంతో ఎన్నికల ఆర్డర్లతో హోటల్స్ కిటకిటలాడుతున్నాయి.

రవాణా సౌకర్యం

అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తలను ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్లడానికి వాహనాలను సమకూర్చుతారు. ఒక్కో వాహనం అద్దె రోజుకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు యజమానులకు సమకూరనుంది. అధిక సంఖ్యలో వాహనాలు మండల కేంద్రాల్లో పట్టణాల్లో తిరగాల్సి ఉండడంతో ఇంధన వినియోగం పెరిగే అవకాశముంటుంది. ఇదే కాకుండా అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు పెట్టుకుని ఆటోలు, వ్యాన్‌లు తిప్పుతుంటారు.

ప్రచారానికి టీ షర్టులు

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల పేర్లు, చిత్రాలతో టీ షర్టులను ముద్రించి యువకులకు పంపిణీ చేస్తుంటారు. ఏ వీధిలో చూసినా అభ్యర్థి పేరు మార్మోగాలని ఇదొక రకం వ్యూహంగా అభ్యర్థులు భావిస్తుంటారు. ఒక్కో టీ షర్టు ధర రూ.150 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. ఈ విధంగా వేలాది టీ షర్టులు ముద్రించే అవకాశముంటుంది. ఈ లెక్కన వీటికే రూ.లక్షల్లో ఖర్చు చేసే అవకాశముంది.

కూలీలకు డిమాండ్

గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేపట్టే సమయంలో కూలీలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఒక్కో కూలీకి టిఫిన్, భోజనం పెట్టి రూ.500 వరకు చెల్లించే అవకాశముంది. అభ్యర్థులు తమ పట్టును నిరూపించుకునేందుకు ర్యాలీలు చేస్తుంటారు. అలా ర్యాలీలు చేసే సందర్భాలు, ప్రచారం చేసే సమయంలో తమ పట్టును చూపించుకునేందుకు జన సమీకరణ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో జన సమీకరణలో భాగంగా కూలీలను వినియోగిస్తుంటారు.

రైలు బోగీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

నిడదవోలు : రైలు బోగీలో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందడంతో ఆదివారం జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు..తిరుపతి నుంచి పూరి వెళుతుతున్న ఎక్స్‌ప్రెస్ వికలాంగుల బోగిలో గుర్తు తెలియని వృద్ధుడు చనిపోవడాన్ని ప్రయాణికులు గుర్తించారు. ఈ విషయాన్ని లోకో పైలెట్ దృష్టికి తీసుకువెళ్లారు. లోక్ పైలెట్ నిడదవోలు రైల్వేస్టేషన్ మాస్టర్‌కి సమాచారం ఇచ్చారు. నిడదవోలు రైల్వే స్టేషన్‌కి శనివారం రాత్రి 11 గంటలకు పూరి ఎక్స్‌ప్రెస్ చేరుకుంది. వికలాంగుల బోగిలో గుర్తుతెలియని సుమారు 60 ఏళ్ల వృద్ధుడు మృతిచెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. బోగిలో నుంచి మృతదేహాన్ని దించి నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నలుపు, తెలుపు సన్నని ఛారలు ఉన్న చేతుల చొక్కా, మాసిన పసుపు రంగు లుంగీ, నీలం రంగు టవల్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల కోసం 9490617090, 7013360296 సెల్ నంబర్లలో సంప్రదించాలని రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు.

దాడుల్లో 14 మంది అరెస్ట్

తనిఖీల్లో రూ.6.86 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, నిఘా బృందాలు పలు చోట్ల దాడులు, తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు బ్రేకులు వేస్తున్నాయి. జిల్లాలో శని, ఆదివారాల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 14 మందిని అరెస్ట్ చేయడంతో రూ.6.86 లక్షల నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఈ నిఘా బృందాలు పనిచేస్తున్నాయి. ఈ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఆదివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 6 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 57 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 12.28 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రామచంద్రపురం, ద్రాక్షారామ, మండపేట రూరల్, మండపేట పట్టణం, అంగర పోలీసు స్టేషన్ల పరిధిలో పలు వాహనాలను తనిఖీ చేసి రూ.6.86 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- ద్రాక్షారామ, మండపేట టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 4.43 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 3 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 45 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 11.79 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో ఆదివారం కూడా వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు చేశారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ బూత్‌ల్లో ప్రజలు నిర్భయంగా ఓట్లు వేసే దిశగా జిల్లాలోని పలుచోట్ల పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. అమలాపురం పట్టణం బ్యాంక్ స్ట్రీట్, ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డు, గడియారం స్తంభం సెంటర్, ఐ.పోలవరం మండలం కొమరిగిరి, ద్రాక్షారామ మండలం హసన్‌బాద్, ఉండూరు, కందులపాలెంలో కవాతు జరిగింది.


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

వైఎస్సార్ సీపీ గెలిస్తే ముద్రగడ ఇంట్లో సర్వెంట్‌గా పనిచేస్తా

సినీ నటుడు పృథ్వీరాజ్


విలేకరులతో మాట్లాడుతున్న సినీ నటుడు పృథ్వీరాజ్

పి.గన్నవరం: ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల లోపు వైఎస్సార్ సీపీ కనీసం రెండు, మూడు సీట్లలో గెలిస్తే తాను ముద్రగడ పద్మనాభం ఇంట్లో సర్వెంట్‌గా పనిచేస్తానని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. సినీ నటులను నమ్మవద్దు, తరిమి కొట్టండి అని.. ముద్రగడ అంటున్నారని పృథ్వీరాజ్ మండిపడ్డారు. పి.గన్నవరంలో జనసేన పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు మద్దతుగా ఆపార్టీ కార్యాలయంలో ఆదివారం పృథ్వీరాజ్ విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని అన్నారు. కూటమి అభ్యర్థులకు అన్ని వర్గాల ప్రజలు ఓట్లేసి గెలిపించాలని కోరారు. గతంలో తనకు 'చిప్'దొబ్బిన కారణంగా వైఎస్సార్ సీపీలో చేరానని అన్నారు. ఎన్డీఏకి మెగాస్టార్ చిరంజీవి మద్దతు పలికారని, ఈ ఎన్నికల్లో ఆయన తమ కూటమికి మద్దతుగా ప్రచారం చేస్తారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి విషయంపైనా ఆయన సెటైర్లు వేశారు.

అయినవిల్లిలో కిక్కిరిసిన భక్తులు


విఘ్నేశ్వర స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 25 మంది, ప్రత్యేక దర్శనంలో 359 మంది, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 8 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 38 మంది తమ నూతన వాహన పూజలు, 40 చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాలు జరిపారు. అయిదుగురు భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,656 మంది ప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,86,111 లభించాయని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నవ దంపతులకు ఉచితంగా సత్యదేవుని అంతరాలయ దర్శనం

అన్నవరం: నవ దంపతులకు శుభవార్త. సత్యదేవుని దర్శనానికి విచ్చేసే నవ దంపతులకు స్వామివారి అంతరాలయ (స్పెషల్) దర్శనం ఉచితంగా చేయించనున్నట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదివారం తెలిపారు. వీరు ఎటువంటి ప్రత్యేక రుసుం చెల్లించకుండా స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకోవచ్చునని ఈఓ తెలిపారు.

ఘనంగా సదస్యం


స్వామివారికి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు


ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేకువ జామునే గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాద్ అచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పాల్గొని వేద పారాయణ చేశారు. సుప్రభాత సేవ, బాలభోగం, విష్వక్సేన పూజ, వేద పారాయణం, నివేదన, బలిహరణ, కార్యక్రమాలను వేద పండితులు, అర్చక స్వాములు వేద మంత్రాల పఠనతో నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ అందించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్వామివారిని ఆభరణాలతో అలంకరించి మిరమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పవళింపు సేవ నిర్వహించారు. ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. సోమవారం తెప్పోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష స్వాధీనం


సామర్లకోట మండలం ఉండూరు బ్రిడ్జి వద్ద నగదు స్వాధీనం చేసుకున్న టీము సభ్యులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.1.01,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె. సీతారామారావు తెలిపారు. సామర్లకోట మండలం ఉండూరు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్కు పోస్టు వద్ద టీము అధికారి కె.వెంకటరాజు గుప్తా తనిఖీ చేసిన సమయంలో వాహన యజమాని ఆర్.శైలజ వద్ద నగదు కు సంబంధించిన రికార్డులు లేక పోవడంతో ఆ నగదు స్వాధీనం చేసుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపగా దానిని కాకినాడ ట్రెజరీకి జమ చేసినట్టు సీతారామారావు తెలిపారు.

రత్నగిరిపై పెళ్లి సందడి


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవ దంపతులు, భక్తులు

- వందలాది మంది నవ దంపతులతో ఆలయ ప్రాంగణం కళకళ
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలి వచ్చిన భక్తులు, నవదంపతులు, వారి బంధుమిత్రులతో ఆదివారం కిక్కిరిసి పోయింది. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై వందకి పైగా వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలి రావడంతో ఆలయంలో ఎక్కడ చూసినా నవదంపతులే దర్శనమిచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకు ఆభక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.